క్లుప్తంగా

నాణ్యమైన బోధన అందించండి..

కొత్తగూడెంఅర్బన్: మన ఊరు – మనబడి కార్యక్రమం ద్వారా సమకూరిన అన్ని వస్తువులను సద్వినియోగం చేసుకుని విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి ఎస్‌కే సైదులు సూచించారు. సోమవారం ఆనందఖనిలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో జరుగుతున్న శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముఖ్యంగా ప్రైవేట్, కార్పొరేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ టీవీలను వినియోగించి ఎలా బోధించాలనే అంశంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ జుంకీలాల్, హెచ్‌ఎం షకీల తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా సభను జయప్రదం చేయండి

చుంచుపల్లి: ఖమ్మంలో ఈ నెల 15న జరగబోయే అమిత్‌షా భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణ, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఆకుల నాగేశ్వరరావుగౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం ఓబీసీ మోర్చా జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా నుంచి నియోజకవర్గానికి 10,000 మంది చొప్పున తరలివెళ్లేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో గంధం నాగేంద్రప్రసాద్, పైడిపాటి రవీందర్, వంశీ, సువర్ణకంటి మోహన్‌రావుగౌడ్, సాయిరాం, భోగి కృష్ణ, ఉబ్బనపల్లి వినీల్‌కుమార్, రమేశ్, భాస్కర్, శంకర్, విజయ్, లిక్కి, శివ, ప్రకాష్ పాల్గొన్నారు.

రైతులపై వివక్ష తగదు

పాల్వంచ: రైతాంగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వివక్ష తగదని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కందగట్ల సురేందర్, జిల్లా కోశాధికారి జక్కుల రాంబాబు అన్నారు. మంగళవారం పట్టణ పరిధిలోని పాలకోయతండాలో పాల్వంచ, బూర్గంపాడు మండలాల అఖిల భారత రైతు కూలీ సంఘం జనరల్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. నాయకులు వైఎస్ రెడ్డి, సతీశ్, కుంజ భద్రు, కళింగరెడ్డి, దూలయ్య, జోగారావు, గణేశ్, భాస్కర్, వీరమల్ల ఉమ, వినోద, వీరమ్మ పాల్గొన్నారు.

రైతులను సకాలంలో ఆదుకోవాలి

టేకులపల్లి: రైతులను సకాలంలో ఆదుకోవాలని ఏఐకేఎంఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎట్టి నరసింహారావు, గుగులోతు రామచందర్ డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో సోమవారం టేకులపల్లి తహసీల్దార్ వీరభద్రంకు వినతిపత్రం అందజేశారు. అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వాలు రైతును ఆదుకోవడంలో విఫలమయ్యాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో బాదావత్ వెంకట్రావు, పూనెం గుదయ్య, కల్తీ వెంకటేశ్వర్లు, ప్రసాద్, లక్ష్మి పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతి

ఇల్లెందు: జీఓ 76 ప్రకారం స్టేషన్‌బస్తీ వాసులకు ఇంటి పట్టాలు అందజేయాలని, సింగరేణి, రెవెన్యూ జాయింట్ సర్వే చేపట్టాలని అక్కడి బస్తీవాసులు విజ్ఞప్తి చేశారు. సోమవారం మున్సిపల్ చైర్మన్ డీవీ, కౌన్సిలర్ మొగిలి లక్ష్మి ఆధ్వర్యంలో కలెక్టర్ అనుదీప్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సయ్యద్ ఆజం, ఈశ్వర్, నారాయణ, వీర్ల శ్రీను, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని జేవీఆర్, కిష్టారం ఓసీలతో పాటు కార్మిక కాలనీల్లో సమస్యలను పరిష్కరించాలని టీబీజీకేఎస్ నాయకుడు ఎండీ రజాక్ కోరారు. ఆయన సోమవారం కొత్తగూడెం జీఎం జక్కం రమేశ్‌కు వినతిపత్రం అందజేసి సమస్యలను వివరించారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

ఇల్లెందు: అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 16న ఆదిలాబాద్ నుంచి జీపుజాతా ప్రారంభమవుతుందని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వెంకటమ్మ తెలిపారు. సోమవారం సీఐటీయూ కార్యాలయంలో వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. అబ్దుల్ నబీ, కృష్ణ, రాంబాయి, మరియ, ఫాతిమా, సంధ్య, యాకమ్మ, దేవేంద్ర, తిరుమల, రేణుక పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్

టేకులపల్లి: మండలంలోని బోడు గ్రామంలో 11 కేవీ విద్యుత్ తీగ తెగిపడడంతో షార్ట్ సర్క్యూట్ జరిగింది. గ్రామంలో పోలీస్ స్టేషన్ నుంచి జీపీ ఆఫీస్ బజార్‌లో సోమవారం 11 కేవీ విద్యుత్ తీగ తెగి పక్కనే ఇళ్లకు విద్యుత్ సరఫరా చేసే స్తంభంపై పడింది. షార్ట్ సర్క్యూట్ జరగగా, పలు షాపులు, ఇళ్లలోని గృహోపకరణాలు కాలిపోయాయని సర్పంచ్ ఇర్ప లక్ష్మీనారాయణ తెలిపారు. ఆస్తి నష్టం సుమారు రూ.3 లక్షలకు పైగానే ఉంటుందని పేర్కొన్నారు.

ఇద్దరికి గాయాలు

టేకులపల్లి: ద్విచక్ర వాహనదారులు చెట్టును ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ముత్యాలంపాడుకు చెందిన ఇస్రం శ్రీకాంత్, అశ్వాపురానికి చెందిన ఐ.నవీన్ బైక్‌పై సోమవారం ఇల్లెందు వైపు వెళ్తున్నారు. వెంకట్యాతండా స్టేజీ వద్ద అదుపు తప్పి రోడ్డు పక్కనే చెట్టును ఢీకొట్టారు. ఈ ఘటనలో శ్రీకాంత్, నవీన్‌కు గాయాలు కాగా కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

కోతుల కట్టడికి కొత్త వ్యూహం

- ఇనుప జాలీతో దుకాణాలకు రక్షణ
- పంట చేలు, గృహాలకు సోలార్ కంచెల ఏర్పాటు
- సత్ఫలితాలు ఇస్తున్న ప్రత్యామ్నాయ చర్యలు


బాలాజీనగర్‌లో దుకాణానికి ఏర్పాటుచేసిన ఇనుప జాలీ


ఇంటికి ఏర్పాటు చేసిన సోలార్ ఫెన్సింగ్

ఇల్లెందురూరల్: సరిపడా ఆహారం లేక, తాగడానికి నీళ్లు దొరకక అడవుల్లో ఉండాల్సిన కోతులు పల్లె, పట్టణాల బాట పడుతున్నాయి. అందుబాటులో ఉన్న వస్తువులను లాక్కుంటూ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నాయి. ఇళ్లలోకి చొరబడి వస్తువులను ఎత్తుకెళ్తుండగా.. వానరాల బెడదతో కూరగాయల సాగు చేసేందుకు రైతులు జంకుతున్నారు. కొన్నిచోట్ల ధైర్యం చేసి పండించినా అవి కోతుల పాలే అవుతున్నాయి. అన్నింటికి మించి మనుషుల మీద దాడి చేస్తూ గాయపరుస్తున్నాయి. వీటి పరిష్కారానికి ప్రభుత్వం, స్థానిక సంస్థలు పెద్దగా దృష్టి సారించకపోవడంతో ప్రజలే కోతుల కట్టడికి ప్రత్యామ్నాయ చర్యలకు దిగుతున్నారు.

ఇనుప జాలీతో..

కోతులు కేవలం కూరగాయల తోటలకు మాత్రమే పరిమితం కావడం లేదు. కిరాణా దుకాణాల్లో ఉండే ఆహార పదార్థాలను రెప్పపాటులో మాయం చేస్తున్నాయి. దీంతో చాలామంది దుకాణాల యజమానులు షాపులకు ఇనుప జాలీలతో తలుపులు బిగించుకుంటున్నారు. ఇక ఇళ్లలోకి కోతులు చొరబడకుండా మెష్ డోర్ల ఏర్పాటు తప్పనిసరైంది.

పంట చేలకు సోలార్ ఫెన్సింగ్

గ్రామాల సమీపం, ప్రధాన రహదారుల వెంట, అడవులకు సమీపాన ఉన్న పంట చేలకు కోతుల బెడద తప్పడం లేదు. ఏ పంట వేసినా మొలక దశలోనే కోతులు పీకేస్తున్నాయి. దీంతో కొందరు రైతులు చేలకు సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకుంటున్నారు. ప్రధానంగా కూరగాయల సాగు చేసే రైతులు ఆర్థికంగా భారమైనా మొగ్గుచూపుతున్నారు. ఎకరం విస్తీర్ణంలో కర్రల సాయంతో సోలార్ కంచె ఏర్పాటు చేసేందుకు రూ.పది వేల నుంచి రూ.పదిహేను వేల వరకు ఖర్చు వస్తోందని రైతులు చెబుతున్నారు. సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకున్న రైతులకు కోతుల బెడద లేకపోవడంతో మంచి దిగుబడి సాధిస్తున్నారు.

సోలార్ కంచెతో ఇళ్లకు రక్షణ..

ఇంటి ముందు పచ్చని చెట్టు, ఇంటి వెనకాల పెరడు.. అందులో కూరగాయలు, పూల మొక్కలు.. ఇవన్నీ వినడానికి బాగానే ఉన్నా కోతుల బెడదతో ఎక్కడా కనిపించడం లేదు. చాలా మంది ఏపుగా పెరిగిన చెట్లను నరికేస్తుండగా, కూరగాయలు, పండ్లు, పూలమొక్కలు పెంచడమే మానేశారు. ఈ నేపథ్యాన స్తోమత ఉన్న వారు కోతుల బెడద నుంచి రక్షణ కోసం ఇంటిచుట్టూ సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకుంటున్నారు. చదరపు మీటర్ వైశాల్యానికి రూ.700 నుంచి రూ.800 వరకు ఖర్చు వస్తోంది. అయినప్పటికీ ఎవరూ వెనుకడుగు వేయడం లేదు.

రాయితీ తగ్గింపుతో పెరిగిన ధరలు

గతంలో సోలార్ విద్యుత్ వినియోగం పెంచేలా ప్రభుత్వం అధిక మొత్తంలో రాయితీ ఇచ్చేది. కానీ, ఏడాది కాలంగా రాయితీ తగ్గించడంతో సోలార్ ఫెన్సింగ్ సామగ్రి ధరలు పెరిగిపోయాయి. ఇది కోతుల బెడదను ఎదుర్కొంటున్న రైతులు, గృహ యజమానులకు భారంగా మారింది. సోలార్ విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం రాయితీ పెంచితే అందరికీ కోతుల దాడి నుంచి రక్షణ లభిస్తుందని చెబుతున్నారు.

ఏడాదికాలంగా వినియోగిస్తున్నాం



గతంలో ఆరుబయటకు రావాలంటేనే భయమేసేది. ఇంటి చుట్టూ కోతులు అంతగా తిరిగేవి. ఏడాది కిందట సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేశాం. అప్పటి నుంచి కోతులు రాకపోవడంతో ఆవరణలో కూరగాయలు పండడమే కాక రక్షణ లభిస్తోంది.

–మెట్టెల శిరోమణి,
జగదాంబగుంపు, ఇల్లెందు మండలం

సోలార్ వినియోగంతో ఆర్థికాభివృద్ధి



అరెకరం ఇంటి జాగాలో చిన్న చిన్న షెడ్లు వేసి కోళ్లు పెంచాను. ప్రారంభంలో కోతులు గుడ్లు ఎత్తుకెళ్లేవి. కోడిపిల్లలను కొరికేసేవి. దీంతో సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకున్నాను. ప్రస్తుతం నెలకు రూ.పది వేలకు పైగా ఆదాయం ఉంటోంది.

–మూలగుండ్ల ఉపేందర్‌రావు,
రైతు, బొజ్జాయిగూడెం

తక్కువ ఖర్చుతో ఫెన్సింగ్



రాయితీ తగ్గినా ప్రజలకు సాధ్యమైనంత తక్కువ ఖర్చుతో సోలార్ ఫెన్సింగ్ సౌకర్యాన్ని అందుబాటులోకి తెస్తున్నాం. గతంలో ఆర్థికంగా ఉన్న వాళ్లకే పరిమితమవగా ఇప్పుడు అందరూ ప్రత్యామ్నాయంగా భావిస్తున్నారు. మాకూ ఉపాధి మెరుగైంది.

–బయ్య సాయికుమార్,
సోలార్ ఫెన్సింగ్ ఫిట్టర్, సత్యనారాయణపురం

20 రోజులుగా వెలగని వీధిలైట్లు

సుజాతనగర్: మండలంలోని కొత్త అంజనాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని వీధుల్లో 20 రోజులుగా వీధి లైట్లు వెలగక చీకట్లు అలుముకున్నాయి. 20 రోజుల కిందట అకాల వర్షం, గాలి దుమారం రావడంతో సుమారు 40 బల్బుల దాకా కాలిపోయాయి. వీటితో పాటు విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన వీధి దీపాలు కూడా వెలగడం లేదు. కొత్తవి వేయాలని స్థానికులు కోరుతున్నా పట్టించుకొనే దిక్కులేదు. గతంలో తాము చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన డబ్బులు పెండింగ్‌లో ఉన్నాయని పంచాయతీ సిబ్బంది అంటున్నారని స్థానికులు చెబుతున్నారు.

హెవీ మోటార్ వెహికిల్ డ్రైవింగ్‌లో శిక్షణ

ఇల్లెందు: ఇల్లెందు ఏరియాలోని ఓసీ ప్రభావిత ప్రాంత యువకులు, భూనిర్వాసితులు, మాజీ ఉద్యోగుల పిల్లలు, ఓసీ విస్తరణ ప్రభావిత గ్రామాల యువకులకు హెవీ మోటార్ వెహికిల్ డ్రైవింగ్ (వోల్వో డంప్ ట్రక్ ఆపరేటర్)లో శిక్షణ ఇవ్వనున్నట్లు సింగరేణి ఏరియా జీఎం షాలేము రాజు సోమవారం తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులై 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు కలిగి ఉండాలని, హెవీ గూడ్స్ వెహికల్ లైసెన్స్‌తోపాటు మూడేళ్ల అనుభవం కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి గల నిరుద్యోగులు ఎంవీటీసీ కార్యాలయంలో ఈ నెల 15 లోపు జిరాక్స్ పత్రాలు అందజేయాలని కోరారు.

గణేశ్ టెంపుల్‌లో సుందరీకరణ పనులు

కొత్తగూడెంటౌన్: పట్టణంలోని శ్రీవిజయ విఘ్నేశ్వరస్వామి దేవస్థానం (గణేశ్ టెంపుల్)లో రూ.49.50 లక్షలతో సుందరీకరణ పనులు చేపట్టనున్నామని ఆలయ ఈఓ సులోచన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు ఆలయంలో ముఖ మండపాలను ఆధునీకీకరించామని, గ్రానైట్ ఫ్లోరింగ్ చేయించామని తెలిపారు.

2కే రన్ ప్రారంభించిన ఎమ్మెల్యే



2కే రన్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే హరిప్రియ

ఇల్లెందు: రాష్ట్రంలో ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలవుతోందని ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ అన్నారు. సోమవారం ఇల్లెందు సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో పట్టణంలోని గోవింద్‌సెంటర్ నుంచి జగదాంబసెంటర్ వరకు 2కే రన్ సాగింది. గోవింద్‌సెంటర్‌లో 2కే రన్‌ను ఎమ్మెల్యే హరిప్రియ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో డీఎస్పీ రమణమూర్తి, జెడ్పీ సీఈఓ విద్యాలత, గ్రంథాలయ చైర్మన్ దిండిగాల రాజేందర్, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లు వెంకటేశ్వరరావు, జానీపాషాతోపాటు మాధవరావు, కరుణాకర్, రవీందర్, అంకుషావలి, కృష్ణ, రంగనాథ్, పేరయ్య, ప్రమోద్, రవి, రేణుక, ధనలక్ష్మి, కార్తీక్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి ఆలయ అభివృద్ధే ధ్యేయం


షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు తదితరులు

పాల్వంచరూరల్: మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే తమ ధ్యేయమని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు తెలిపారు. ఆలయం ఎదురుగా రూ.1.02 కోట్లతో నిర్మించిన 12 షాపులతో కూడిన కాంప్లెక్స్‌ను సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. త్వరలోనే రెండు ఫంక్షన్ హాళ్లను కూడా ప్రారంభిస్తామని, అమ్మవారి సన్నిధిలో శివాలయం నిర్మాణ పనులు కూడా వేగంగా సాగుతున్నాయని తెలిపారు. ఆలయ చైర్మన్ మహిపతి రామలింగం, జెడ్పీటీసీ బరపటి వాసుదేవరావు, ఎంపీపీ మడివి సరస్వతి, సర్పంచ్ బి.అనిత, దేవాదాయ శాఖ పరిశీలకులు పి.బేల్‌సింగ్, ఈఓ ఎన్.రజనీకుమారితో పాటు ఎస్వీఆర్కే ఆచార్యులు, చందుపట్ల శ్రీనివాసరెడ్డి, చింత నాగరాజు, గంధం వెంగళరావు, కిలారు నాగమల్లేశ్వరరావు, సంకా వెంకటరామారావు, కాటరాపు లక్ష్మీనారాయణ, పాయం పాపయ్య, మల్లెల శ్రీరామ్మూర్తి, రాజ్‌గౌడ్, బండ్లపల్లి వెంకటనారాయణ, కొండం పుల్లయ్య పాల్గొన్నారు.

విద్యుత్ కోతలపై వినూత్న నిరసన


నిరసన తెలుపుతున్న బీఎస్పీ నాయకులు

కొత్తగూడెంఅర్బన్: జిల్లా కేంద్రంతో పాటు చుట్టుపక్కల ప్రాంత ప్రజలు విద్యుత్ కోతలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కొత్తగూడెంలో 132/33 కేవీ సబ్ స్టేషన్ నిర్మించి విద్యుత్ కోతలను నివారించాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రా కామేశ్ డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ శ్రేణులతో కలిసి భజన మందిర్ రోడ్డులోని విద్యుత్ డివిజనల్ ఇంజినీర్ కార్యాలయం ఎదుట విసనకర్రలతో గాలి విసురుకుంటూ వినూత్న నిరసన తెలిపారు. కార్యక్రమంలో సాయి, మాలోత్ వీరునాయక్, శంకర్, శారద, సుజాత, కవిత తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం గొర్రెలు కట్టబెట్టొద్దు..

పాల్వంచ: రెండో విడత గొర్రెల పంపిణీలో భాగంగా నాసిరకం గొర్రెలను బలవంతంగా అధికారులు కట్టబెడుతున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు మచ్చా శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు ఎంకే పరమేశ్‌యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ పురంధర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గొర్రెల యూనిట్లు కొనుగోలు చేసేందుకు నియమించిన ఇన్‌చార్జ్‌లు కాంట్రాక్టర్లతో కుమ్మక్కయ్యారన్నారు. వారి దగ్గర యూనిట్లు కొనకుంటే రద్దు చేస్తామని బెదిరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాగా సీతారాములు, వల్లపు యాకయ్య పాల్గొన్నారు.

హైపవర్ వేతనాలు చెల్లించాలి


మాట్లాడుతున్న ఇనపనూరి నాగేశ్వరరావు

సింగరేణి(కొత్తగూడెం): కోలిండియా మాదిరిగా సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ వేతనాలు చెల్లించాలని సింగరేణి కోల్‌మైన్స్ కాంట్రాక్ట్ మజ్దూర్ సంఘ్ ప్రధాన కార్యదర్శి ఇనుపనూరి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం కొత్తగూడెం కార్పొరేట్ పరిధిలోని ఇల్లెందు గెస్ట్‌హౌజ్‌లో జరిగిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కోలిండియా మాదిరిగా సింగరేణి అన్ని విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనానికి సంబంధించిన స్లిప్పులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సింగరేణివ్యాప్తంగా బీఎంఎస్ ఆధ్వర్యంలో సమ్మె చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో దొడ్డ నిర్మల, చందర్, ఎడ్ల రాకేశ్, గుర్రం సృజన్, మంద అజయ్, విజయ్ పాల్గొన్నారు.

బీసీలకే టికెట్ కేటాయించాలి

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా ఏపార్టీవారైన వెనుకబడిన తరగతులవారిని కేటాయించాలని మున్నూరు కాపు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కాసా హన్మంతరావు కోరారు. సోమవారం కొత్తగూడెంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో లింగాల గోపాలకృష్ణయ్య, మహాలక్ష్మి సత్యనారాయణ, వల్లాల ప్రసాద్‌రావు, బాలిశెట్టి సుందర్‌రాజ్, రుక్మాంగధర్‌బండారి, జోగం తారక, మాదాసు కృష్ణయ్య, మత్తి నాగేశ్వరరావు, బండ్ల నకుల్, కోళ్ల నర్సయ్య, కందుకూరి గణేశ్, సైండ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా సాయిరాం

ఇల్లెందు: బీజేపీ అనుబంధ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఇల్లెందుకు చెందిన వల్లపు సాయిరాంను నియమించారు. సోమవారం కొత్తగూడెంలో జిల్లా అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణ, ఓబీసీ మోర్చా నేత ఆకుల నాగేశ్వరరావు చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. కార్యక్రమంలో నాగేంద్రప్రసాద్‌గౌడ్, జలంగి కృష్ణ, రవీందర్, బోగి కృష్ణ, వంశీ, భాస్కర్, శంకర్, విజయ్, శివా, లిక్కి, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

నేడు మహిళా సంక్షేమ దినోత్సవం

ఇల్లెందు: పట్టణంలోని మార్కెట్ యార్డులో తెలంగాణ మహిళా సంక్షేమ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు సీడీపీఓ లక్ష్మీప్రసన్న తెలిపారు. ఇల్లెందు, టేకులపల్లి, గార్ల, బయ్యారం, కామేపల్లి, గార్ల మండలాల నుంచి అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఈ కార్యక్రమానికి హాజరవుతారని, ఎమ్మెల్యే హరిప్రియ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని ఆమె వెల్లడించారు.

వెంగళరావుకు నివాళి

సూపర్‌బజార్(కొత్తగూడెం): మాజీ ఎమ్మెల్యే జలగం వెంకటరావు క్యాంపు కార్యాలయంలో సోమవారం మాజీ ముఖ్యమంత్రి, దివంగత జలగం వెంగళరావు వర్ధంతి సందర్భంగా అభిమానులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పండ్లు, బ్రెడ్ పంపిణీ

పాల్వంచ: మాజీ ముఖ్యమంత్రి, దివంగత జలగం వెంగళరావు వర్ధంతి సందర్భంగా సోమవారం జలగం యువసేన నాయకుల ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్లు, పాలు, బ్రెడ్, మజ్జిగను అందించారు. కార్యక్రమంలో బుడగం రవి, కిరణ్, ప్రవీణ్, నాగేశ్వరరావు, హరీశ్, వంశీ, వినయ్, పవన్, అమీర్, చాణక్య, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

ఇల్లెందురూరల్: మండలంలోని రాఘబోయినగూడెం గ్రామపంచాయతీ పరిధి తంగెళ్లగడ్డకు చెందిన వివాహిత జివ్వాజి అపర్ణ సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఇంట్లో ఎవరూలేని సమయంలో ఆమె ఉరి వేసుకోగా వచ్చిన కుటుంబ సభ్యులు ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి కొత్తగూడెం తరలించారు.

పాఠశాలలు పునఃప్రారంభం

వేసవి సెలవుల అనంతరం సోమవారం నియోజకవర్గవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. తొలి రోజు పాఠశాలలకు పిల్లలు తక్కువ మంది హాజరయ్యారు. తొలిరోజే విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలు అందించారు. ఎంఈఓలు పలు పాఠశాలలను సందర్శించారు. కాగా, ఇల్లెందు, టేకులపల్లి మండలాల్లోని గిరిజన పాఠశాలల్లో గిరిజన దినోత్సవం నిర్వహించారు. –సాక్షి నెట్‌వర్క్


పాల్వంచరూరల్: నాగారం హైస్కూల్లో తరగతి గదిని శుభ్రం చేస్తున్న సిబ్బంది


జూలూరుపాడు: విద్యార్థులకు యూనిఫాం అందిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు


ఇల్లెందు: గిరిజన పాఠశాలలో సంబరాలను ప్రారంభిస్తున్న ఏటీడీఓ రూపాదేవి


ఇల్లెందురూరల్: యూనిఫాం, పాఠ్యపుస్తకాలు అందిస్తున్న రమేశ్, ఉపాధ్యాయులు


టేకులపల్లి: చుక్కాలబోడు పాఠశాలలో పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

ముగిసిన అంకమ్మతల్లి జాతర


కోర్లబండి వద్ద పూజలు చేస్తున్న భక్తులు

సుజాతనగర్: మండలంలోని రాఘవాపురం గ్రామంలో ఈ నెల 8 నుంచి ప్రారంభమైన అంకమ్మతల్లి జాతర 5వ రోజైన సోమవారం అశేష భక్త జనసందోహం నడుమ ముగిసింది. సుమారు 250 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ జాతరను ప్రతి రెండేళ్లకు ఒకసారి నిర్వహిస్తారు. జాతర చివరి రోజు కావడంతో కొత్తగూడెం, అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ, సుజాతనగర్, టేకులపల్లి, ఇల్లెందు, జూలూరుపాడు, ఏన్కూరు తదితర మండలాలకు చెందిన సుమారు 10 వేల మంది భక్తులు ఈ జాతరలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. జాతరలో ముఖ్యమైన ఘట్టాలైన కొలబియ్యం, వీరతాడు, అనంత బండారం, వసంతోత్సవం, కోర్లబండి కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్ధల నడుమ నిర్వహించిన అనంతరం అమ్మవారిని కోర్లబండిపై సాగనంపారు. జాతరలో వీరతాడు, వసంతోత్సవం, కొలబియ్యం తదితర కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చివరోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు బోనాలు సమర్పించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అవాంఛనీయ ఘటనలు జరక్కుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలి


ప్రదర్శన నిర్వహిస్తున్న ప్రజాపంథా నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక రైల్వేస్టేషన్ నుంచి పాత ఆర్టీసీ డిపో వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఖరీఫ్ రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, గిరిజనేతరులు, వలస ఆదివాసీలతో సహా పోడుసాగు చేసుకుంటున్న వారందరికీ హక్కుపత్రాలు ఇవ్వాలని, అర్హులైన వారందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని, ఇంటి స్థలం ఉన్న వారికి రూ.10 లక్షలు ఇవ్వాలని, అర్హులైన పేదలందరికీ తెల్లరేషన్ కార్డులు మంజూరు చేయాలని, అర్హులకు పెన్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కెచ్చెల రంగారెడ్డి, గుమ్మడి నర్సయ్య, రాయల చంద్రశేఖర్, ముద్దా భిక్షం, నాయిని రాజు, నూపా భాస్కర్, ప్రభాకర్, మధుసూదన్‌రెడ్డి, అమర్లపూడి రాము, జాటోత్ కృష్ణ, మాచర్ల సత్యం, పి.సతీశ్, జ్యోతి, సరోజ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.